జూన్‌కు లింకు, టన్నెల్ పనులు

- కేంద్రం రూ.2,300 కోట్లు బిల్లుల బకాయి
- వచ్చే నెలలో ఆర్ అండ్ ఆర్ కాలనీలను సందర్శిస్తా
- పోలవరం పర్యటనలో సిఎం జగన్మోహన్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో సిఎం జగన్, మంత్రులు, అధికారులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి వచ్చే ఏడాది జూన్‌కల్లా లైనింగ్‌తోపాటు రెండు కాల్వల లింకు పనులు, టన్నెల్ పనులు పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించి దాదాపు రూ.2,300 కోట్లు బిల్లులు కేంద్రం నుంచి రావాల్సి ఉందని అన్నారు. అయినా, పనులకు ఎక్కడా ఆటంకం రాకుండా రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులను ఇస్తోందని తెలిపారు. తాడేపల్లి నుంచి నేరుగా హెలీకాప్టర్‌లో పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి సోమవారం చేరుకున్న ఆయనకు మంత్రులు, ఉభయగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు పనులను, స్పిల్‌వే వద్దకు వెళ్లి ఆ పనుల తీరును సిఎం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. గత రెండేళ్లలో పూర్తయిన పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులను అధికారులు సిఎంకు వివరించారు. అనంతరం కొండపై సమావేశ మందిరంలో అధికారులతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. సుమారు ఆరు నెలలుగా బిల్లులు పెండింగులో ఉన్నాయని, కేంద్రం నుంచి రావాల్సిన డబ్బులు సకాలంలో వచ్చేలా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. వచ్చే నెలలో ఆర్ అండ్ ఆర్ కాలనీలను సందర్శిస్తానన్నారు. నిర్వాసితులకు జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. నిర్వాసితుల్లో ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాలున్నవారికి తిరిగి భూములు ఇచ్చేందుకు భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 'నిర్వాసితులకు ఏదో కట్టాం కదా... అన్నట్టు పునరావాస కాలనీలు కట్టకూడదు. అక్కడి ఇళ్లలో నిర్వాసితులు జీవితాంతం ఉంటారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. నిర్వాసితుల ఇళ్ల నిర్మాణంలో నాణ్యత కచ్చితంగా పాటించాలి' అని దిశానిర్దేశం చేశారు. పునరావాస కాలనీల నిర్మాణంలో అలసత్వానికి తావులేకుండా చూడాలని, నాణ్యత కచ్చితంగా పాటించాలని, ఆర్ అండ్ ఆర్ పనుల నాణ్యత పరిశీలనకు ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. ఆ అధికారి ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను తప్పకుండా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని, తప్పులున్నాయని చెప్పినప్పుడు కచ్చితంగా వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. అదనంగా కొంత డబ్బు ఎక్కువ ఖర్చు పెట్టినా నాణ్యత మాత్రం తప్పకుండా పాటించాలని, కాలనీల నిర్మాణానికి సమాంతరంగా మౌలిక సదుపాయాల కల్పన జరగాలని, నిర్వాసితులకు ఇబ్బందులు రాకుండా మంచి పునరావాసం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్థికంగా రాష్ట్రానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన బిల్లులు పెండింగులో పెట్టడం లేదన్నారు. ఇకపైనా పెండింగులో పెట్టకుండా చూడాలని అధికారులను సూచించారు. దిగువ కాఫర్ డ్యాం పనులు, ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం (ఇసిఆర్‌ఎఫ్) పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్పిల్‌వే పనులు దాదాపు పూర్తి చేశామని, 48 గేట్లలో 42 గేట్ల అమరిక పూర్తయిందని, మిగిలిన గేట్లను కూడా త్వరలోనే బిగిస్తామని సిఎంకు అధికారులు తెలిపారు. జర్మనీ నుంచి సిలిండర్లు వచ్చాయని, ఎగువ కాఫర్ డ్యాంలో ఉన్న ఖాళీలను పూర్తి చేశామన్నారు. కాఫర్ డ్యాంలో ఖాళీల కారణంగా గతంలో వచ్చిన వరదలకు ఇఎస్‌ఆర్‌ఎఫ్ ప్రాంతం దెబ్బతిందని, ఈ పనులు ఎలా చేయాలనే దానిపై డిజైన్లు ఖరారవుతాయని అధికారులు బదులిచ్చారు. వచ్చే డిసెంబర్ కల్లా తవ్వకం పనులు పూర్తవుతాయని, ఆ తర్వాత మిగిలిన పనులు పూర్తి చేస్తామని, మొత్తం 90 ఆవాసాల్లో ఆగస్టు నాటికి 48 ఆవాసాల నుంచి నిర్వాసితులను తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సిఎంకు అధికారులు వివరించారు.

గళమెత్తిన విఆర్‌ఎలు

- సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు బాలకాశి

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా విఆర్‌ఎలు (గ్రామ రెవెన్యూ సహాయకులు) గళమెత్తారు. రూ.21,000 వేతనం చెల్లించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ విఆర్‌ఎలుగా నియమించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని నినదించారు. విఆర్‌ఎల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. విశాఖ జిల్లా అనకాపల్లి, పాడేరు ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేశారు. అనకాపల్లిలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.బాలకాశి పాల్గొన్నారు. విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో సబ్ కలెక్టర్ కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. అమలాపురం, రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద నిర్వహించిన ధర్నాకు సిఐటియు, సహాయక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. చిత్తూరులో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయం, పార్వతీపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నెల్లూరు జిల్లాలోని తహశీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. గూడూరు, ఆత్మకూరు, కావలి, సూళ్లూరుపేటలో నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టారు.

టెక్కలిలో సబ్ కలెక్టర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రం అందజేశారు.కర్నూలు, అనంతపురంలో ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్యాలయాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒలకు వినతిపత్రాలు అందజేశారు. కడప జిల్లాలోని తహశీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. రాజంపేటలో అధికారులు ఆఫీసుకు రాకపోవడంతో యాచకుడికి వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో కలెక్టరేట్ వద్ద ధర్నా, కొవ్వూరు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గుంటూరులో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.నరసరావుపేట, తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

నిరుద్యోగుల అరెస్టు దుర్మార్గం: చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిరుద్యోగులు ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనకు దిగితే అరెస్టు చేయడం దుర్మార్గమని టిడిపి అధినేత చంద్రబాబు తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే ఉద్యోగాలు భర్తీ చేయాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు. ఉద్యోగ పోరాట సమితి చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం నియంతృత్వంగా ఉక్కుపాదం మోపిందని పేర్కొన్నారు. నిరుద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి టిడిపి పూర్తి సంఘీభావం ప్రకటిస్తోందని తెలిపారు.

లక్ష్మణరావు పదవీకాలం పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన గురుకులాల విద్యా సంస్థల సొసైటీ (ఎపిటిడబ్ల్యుఆర్‌ఇఐఎస్) సంయుక్త కార్యదర్శి ఎస్.లక్ష్మణరావు పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఎపిటిడబ్ల్యుఆర్‌ఇఐఎస్ ఉపకార్యదర్శి (అకడమిక్, ప్లానింగ్), జాయింట్ సెక్రటరీ (ఎఫ్‌ఎసి)గా పనిచేసి గతేడాది అక్టోబరు 31న లక్ష్మణరావు రిటైర్డు అయ్యారని తెలిపారు. ఆయనను గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ఒఎస్‌డి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా ఏడాదిపాటు నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎపిటిడబ్ల్యుఆర్‌ఇఐఎస్ కార్యదర్శి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ.9.72 కోట్లు విడుదల

గిరిజన గురుకుల పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 9.72 కోట్లను వేర్వేరు ఉత్తర్వుల ద్వారా విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు విడుదల చేశారు. వీటిలో నెల్లూరు జిల్లా, వెంకటగిరిలోని గిరిజన గురుకులం బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయల ఏర్పాటుకు రూ.1.52 కోట్లను, గుంటూరు జిల్లా నరసారావుపేటలో గిరిజన గురుకులం బాలురు పాఠశాల నిర్మాణానికి రూ.8.20 కోట్లు విడుదల చేశారు.

మహిళలకు కోటి డోసులు

- కేరళ, హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు ముందున్న ఎపి

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

దేశంలో మహిళలకు ఎక్కువగా కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసిన రాష్ట్రాల్లో ఎపి ముందు వరుసలో ఉంది. అత్యధికంగా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి టీకాలు పంపిణీ చేసిన రాష్ట్రాల్లో కేరళ, హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు ఎపి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 16న రాష్ట్రంలో కరోనా వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఫ్రంట్‌లైన్ వారియర్స్‌తో పాటు 45 ఏళ్లు నిండిన వారికి కలిపి 1.86 కోట్ల డోసులను పంపిణీ చేశారు. ఇందులో కోటి డోసులను కేవలం మహిళలకే ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ కోటి డోసుల్లో 20 లక్షల డోసులు ఐదేళ్లలోపు పిల్లల తల్లులకు అందించినట్లు సమాచారం. టీకాలపై ఉన్న అపోహలు వీడి మహిళలు ముందుకు రావడంతోనే ఇది సాధ్యమైందని వైద్య నిపుణులు అంటున్నారు. అలాగే డిగ్రీ విద్యార్థులకు కళాశాలలు ప్రారంభించిన తరువాతే నేరుగా కళాశాలల వద్దకే వెళ్లి మెడికల్ క్యాంపుల ద్వారా టీకాలు అందించాలని వైద్యారోగ్య శాఖ భావిస్తోంది.

విద్యార్థి, యువజన నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

నిరుద్యోగులపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

అర్థం కాని స్థితి ఏర్పడింది. ఇంత నిర్బంధాన్ని ప్రయోగించినా కొందరు తాడేపల్లి సెంటర్‌వరకూ చేరుకుని నిరుద్యోగ గళాన్ని వినిపించారు. పోరాట సమితి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35,794 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐవైఎస్, ఎఐఎస్ఎఫ్, టిఎస్ఎస్ఎఫ్, తెలుగు యువత, పిడిఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు తాడేపల్లికి తరలిరానున్నారన్న సమాచారంతో పోలీసులు రెండు రోజుల నుండే విస్తృత తనిఖీలు చేపట్టారు. అరెస్ట్‌లకు దిగారు. సోమవారం కూడా ఇదికొనసాగింది. అడుగడుగునా మొహరించిన పోలీసులు అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. వాటర్ క్యానన్లు సిద్ధం చేశారు. విజయవాడలోని కళాక్షేత్రం, జాతీయ రహదారి, తాడేపల్లి మొత్తం పోలీసు వలయంగా మారింది. అయినా అడ్డంకులను దాటుకొని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి బయలుదేరారు. ఉద్యోగాల భర్తీకి నినాదాలు చేస్తూ . పోలీసుల వలయాన్ని చేధించి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో జరిగిన పెనుగులాటలో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. విజయవాడ నగరంలో ఉద్రికత్త సాగుతుండగానే తాడేపల్లిలో జాతీయ రహదారిపై నుండి పలువురు సిఎం ఇంటికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. సుమారు 50 మంది నాయకులు జాతీయ రహదారిపై నుంచి పాత టోల్‌గేట్ వద్దకు దూసుకొచ్చారు. వారిని కూడా పోలీసులు అడ్డుకున్నారు. పలువురు నాయకులను పోలీసులు ఈడ్చిపారేశారు. తాడేపల్లి రహదారి వద్ద, తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అదుపులోకి తీసుకున్న సుమారు 300 మందిని కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పలు పోలీసుస్టేషన్లకు తరలించారు. డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి రామన్న, ఎం సూర్యారావు, ఉపాధ్యక్షులు వై రాము, లక్ష్మణ్, ప్రణీత, నాగేశ్వరరావు, కృష్ణ, ఎస్ఎఫ్‌ఐ అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్న, అశోక్, నాయకులు పావని, బుజ్జమ్మ, సోమేశ్వరరావు, కోటిబాబు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజేంద్రబాబు, ఎన్ లెనిన్ బాబు, ఆనంద్, తెలుగు యువత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరాం చినబాబు, నాగశ్రావణ్, నాయకులు సాయి, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, గనిరాజు, రాష్ట్ర నాయకులు రాజేష్, టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్, ఎస్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల నాగమధు యాదవ్, అమరావతి పరిరక్షణ సమితి నాయకులు కె.శ్రీనివాస్ తదితరులను అరెస్టు చేశారు.

బస్సులలోనూ తనిఖీలు

చలో తాడేపల్లి కార్యక్రమాన్ని అడ్డుకునే నేపథ్యంలో పోలీసులు ప్రతి వాహనాన్నీ ఆపి తనిఖీ చేశారు . విజయవాడ నుంచి గుంటూరు, తెనాలి, మంగళగిరి, అమరావతి వెళ్తున్న ఆర్‌టిసి బస్సులును. ఆ ప్రాంతాల నుండి విజయవాడకు వస్తున్న బస్సులను క్షుణంగా తనిఖీలు చేశారు. తాడేపల్లికి టిక్కెట్ తీసుకున్న యువకులను దింపివేయడం, అరెస్ట్ చేయడం చేశారు. మంగళగిరి పట్టణ శివారు, ఉండవల్లి సెంటర్, ప్రకాశం బ్యారేజ్, వారధికి ఇరువైపులా పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న యువకులను సైతం ఆపి మరీ వివరాలు అడిగారు.

వాణిజ్య పన్నుల జిఓకు తాత్కాలిక బ్రేక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నుల విభాగాలను ఆర్థికశాఖలో కలుపుతూ గతంలో ఇచ్చిన జిఓను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి జిఓ ఇచ్చేవరకు గతంలో ఇచ్చిన జిఓను నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సత్వర చెల్లింపులు చేయాల్సిందే : బిజెపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సత్వరమే చెల్లింపులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బిజెపి కిసాన్‌మోర్చా ప్రెసిడెంట్ వి.శశిభూషణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఎమ్‌డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రైతులకు ఇప్పటికే రూ.3,500 కోట్లు బకాయిలు ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 1,628 మందికి కరోనా

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గత 24 గంటల్లో 71,152 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, 1,628 మందికి వ్యాధి సోకినట్లు తేలింది. 22 మంది మరణించారు. మరో 2,744 మంది కోలుకుని డిశ్చార్జయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో 23,570 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం అత్యధికంగా తూర్పుగోదావరిలో 291, చిత్తూరులో 261 కేసులు నమోదయ్యాయి. అత్యల్పంగా విజయనగరంలో 25, శ్రీకాకుళంలో 27 కేసులు నమోదయ్యాయి. కరోనా లక్షణాలతో చిత్తూరులో ఐదుగురు, కృష్ణాలో నలుగురు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ముగ్గురేసి, అనంతపురంలో ఇద్దరు, తూర్పుగోదావరి, కర్నూలు, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. రాష్ట్రంలో కరోనా మరణాల సంఖ్య 13,154కు చేరిందని వైద్యారోగ్యశాఖ పేర్కొంది.

23న బంగాళాఖాతంలో అల్పపీడనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వాయువ్య బంగాళాఖాతంలో ఈ నెల 23న అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు సోమవారం రాత్రి వెల్లడించారు. మధ్యప్రదేశ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనం, ఉత్తర తీరప్రాంత ఆంధ్రప్రదేశ్ పరిసరాలపై సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీనపడ్డాయని పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర, దక్షిణ కోస్తాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. రాయలసీమలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కరోనా సోకిన టీచర్లకు క్యాజువల్ లీవ్‌లు

- పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరోనా సోకిన ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ సెలవులు మంజూరు చేసింది. కరోనా సోకిన ఉపాధ్యాయులకు క్వారంటైన్ 14 రోజులను క్యాజువల్ లీవ్‌గా పరిగణించాలని విద్యాశాఖ డైరెక్టరు వి.చినవీరభద్రుడు 151 మెమోను సోమవారం విడుదల చేశారు. ప్రాంతీయ, జిల్లా విద్యాశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తీరు మార్చుకోకపోతే

- మూల్యం చెల్లించుకోవాల్సిందే
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతిపై సుప్రీంకోర్టు తీర్పుతోనైనా సిఎం వైఎస్ జగన్ తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అమరావతిపై దుష్ప్రచారం మానుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా ఉన్న అమరావతి రెక్కలు విరచడమే ధ్యేయంగా సిఎం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారన్నారు.

38 మంది రైల్వే సిబ్బందికి అవార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించిన 38 మంది సిబ్బందికి మ్యాన్ ఆఫ్‌ది మంత్ భద్రతా అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు గజానన్‌మాల్యా సోమవారం అందజేశారు. ఇందులో విజయవాడ రైల్వే స్టేషన్‌కు సంబంధించి 14 మంది సిబ్బంది ఈ అవార్డులకు ఎంపిక కావడం హర్షణీయమని డిఆర్‌ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఐఎస్ఐ ఉన్న హెల్మెట్లనే వాడండి : డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ఉన్న హెల్మెట్లను వాడాలని డిజిపి గౌతమ్ సవాంగ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని రోడ్డు భద్రత నిపుణులు, ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ వైద్యులు, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఐఎస్ఐ స్టాండర్డ్ ఉన్న హెల్మెట్లను వాడాలని సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ విశ్రాంత అధికారి వసంతరావు

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

- ప్లాంట్ విశ్రాంత అధికారి వసంతరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, విస్తరణకు సకాలంలో అనుమతుల మంజూరు చేసి తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ప్లాంట్ విశ్రాంత అధికారి వసంతరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 158వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి వసంతరావు మాట్లాడుతూ.. నాణ్యమైన ఉక్కును అందిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగితే దేశంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. దీనిని రక్షించుకోవడం అందరి కర్తవ్యంగా భావించాలని పిలుపునిచ్చారు.విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ కె.సత్యనారాయణ రావు, గంధం వెంకట్రావు సభ్యులు కొమ్మినేని శ్రీనివాస్, జె.రామకృష్ణ, కెఎం.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ పోరాటం ఢిల్లీకి తగిలేలా చలో పార్లమెంట్ పిలుపునిచ్చామన్నారు.

కమిటీ ముందు 'అచ్చెన్న' హాజరుకావాల్సిందే

- ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ్యుల హక్కులు కాపాడటం తమ విధి అని ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అచ్చెన్నాయుడు మొదటిసారి ఇచ్చిన వివరణ సరిగ్గా లేకపోవడంతో రెండోసారి వివరణ కోరితే ఆయన పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో తర్వాత జరిగే ప్రివిలేజ్ కమిటీ ముందు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ మొదటి అంతస్తులో ప్రివిలేజ్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశానంతరం చైర్మన్ మాట్లాడుతూ శాసనసభ్యుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే జిల్లాల పర్యటన చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేల పేర్లు శిలాఫలకాల్లో లేకపోవడం, అధికారులు సరిగ్గా స్పందించకపోవడం, ప్రోటోకాల్ పాటించని విషయాలపై వచ్చిన ఫిర్యాదులపై చర్చించినట్లు పేర్కొన్నారు. సరైన సమాధానం చెప్పని సభ్యులను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించనున్నట్లు తెలిపారు.

జలశక్తి నోటిఫికేషన్‌తో తీవ్రనష్టం

- జాబ్ కావాలంటే జగన్ పోవాలి
- టిడిపి ముఖ్య నేతల సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జలశక్తి గెజిట్ నోటిఫికేషన్‌తో రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని టిడిపి ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో వ్యవసాయ రంగ అభివృద్ధికి ఇది గొడ్డలిపెట్టులా మారుతుందని అభిప్రాయం పడింది. ఆ పార్టీ ముఖ్యనేతల సమావేశం జాత